క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణ ముఖి నది ఒడ్డున వెలసిన లక్ష్మీనృసింహ స్వామి భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రీతికర మైన రోజు గురువారం కావడంతో ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో లక్ష్మీనృసింహస్వామి వారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. స్వామిని దర్శించుకునేందుకు మండలంలోని పలు ప్రాంతాల నుంచి పూజాసామగ్రి తీసుకుని భక్తులు తరలి వచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు, పూజల నిమిత్తం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు వితరణ చేసింది.

ఏవోబీలో వాహన తనిఖీలు

మక్కువ: మక్కువ, పార్వతీపురం మండలాలకు సమీపం ఏవోబీ (ఆంధ్రా ఒడిశా బోర్డర్)లో పోలీసులు నిశితంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మక్కువ, పార్వతీపురం మండలాల నుంచి ఒడిశా రాష్ట్రానికి, అటునుంచి మక్కువ వైపు వచ్చి, వెళ్తున్న వాహనాలను పోలీసులు ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. వాహనానికి సంబంధించిన వివరాలు, ప్రయాణికులు ఎక్కడికి వెళ్తున్నారో తెలుసుకుంటున్నారు. ఏవోబీలో తాత్కాలిక చెక్‌పోస్టును పోలీసులు ఏర్పాటుచేసి ఎన్నికల సమీపిస్తున్నందున చెక్‌పోస్టు వద్ద గట్టి నిఘాపెట్టారు. మక్కువ, పార్వతీపురం మండలాలకు ఒడిశా రాష్ట్రం సమీపంలో ఉన్నందున, సారా, మద్యాన్ని నియంత్రించేందుకు పోలీసులు దృష్టి సారించారు.

ఎన్నికల వేళ గట్టి నిఘా

పాచిపెంట: ఎన్నికల వేళ పోలీసుల నిఘా మరింత పెంచినట్లు ఏఎస్పీ సునీల్‌షొరైన్ అన్నారు. ఈ మేరకు గురువారం పాచిపెంట మండలంలోని పి.కోనవలస, పద్మాపురం చెక్‌పోస్టులను ఆయన పరిశీలించారు. ఈ చెక్‌పోస్టుల గుండా ప్రయాణిస్తున్న వాహనాలను తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. ఈ క్రమంలో పెద్దవలస, ఈతమానువలస, పద్మాపురం గ్రామాలకు వెళ్లి పోలింగ్‌బూత్‌లను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సై నారాయణరావు తదితరులు ఉన్నారు.

బట్టివలస బ్రిడ్జి నిర్మాణం పూర్తి



బట్టివలస గ్రామం సమీపంలో పూర్తికావచ్చిన బ్రిడ్జి

మక్కువ: మండలంలోని కవిరివలస, బట్టివలస గ్రామాలకు చెందిన ప్రజల బ్రిడ్జి కల సాకారమైంది. ఐటీడీఏ నిధులు సుమారు రూ.80లక్షలతో బ్రిడ్జి పనులు చేపట్టారు. ఈ బ్రిడ్జి పనులు పూర్తికావడంతో బ్రిడ్జికి ఇరువైపులా ఎప్రోచ్ పనులు జరిపిస్తున్నారు. మరో రెండు, మూడురోజుల్లో పనులు పూర్తికానున్నాయి. గతంలో కొండగెడ్డపై బ్రిడ్జి లేకపోవడంతో, బట్టివలస, కవిరివలస, మార్కొండపుట్టి, మర్రివానివలస, కె.పెద్దవలస, కాకువానివలస గ్రామాల ప్రజలు రోగాలబారిన పడితే, వైద్యసేవలకు సకాలంలో శంబర పీహెచ్‌సీకి చేరుకోలేక అనేక ఇబ్బందులు పడేవారు. ఆయా గ్రామాల ప్రజలు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర దృష్టికి సమస్య తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఆయన ఐటీడీఏ అధికారులతో మాట్లాడి, నిధులు మంజూరుచేయించి, బ్రిడ్జి పనులు శరవేగంగా జరిపేలా చర్యలు చేపట్టారు. బ్రిడ్జి పూర్తికావడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

సీతానగరం: మండలంలోని విద్యుత్ సిబ్బంది శుక్రవారం హెవీ విద్యుత్ లైన్ పెట్రోలింగ్ చేయనున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని వినియోగదారులు సహకరించాలని ఏపీఈపీడీసీఎల్ ఏఈ జగన్మోహనరావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మండలంలోని నర్సిపురం నుంచి అప్పయ్యపేట సబ్‌స్టేషన్ వరకూ విద్యుత్ లైన్ పెట్రోలింగ్ చేయనుండడంతో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలియజేశారు. మిగతా గ్రామాలకు విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పార్వతీపురంలో ఓరియంటేషన్



మాట్లాడుతున్న డీఈఓ జి. పగడాలమ్మ

పార్వతీపురంటౌన్: ప్రత్యేక అవసరాలు గల పిల్లల అవసరాలు ఎలా తీర్చాలో తెలిపేందుకు జిల్లాలోని హెడ్‌మాస్టర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మెడికల్ డిపార్ట్‌మెంట్ సిబ్బందికి ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం పార్వతీపురంలోని హైస్కూల్‌లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ పాల్గొని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలు మినహాయింపులు వారికి రావలసిన స్కాలర్‌షిప్స్, ఉపకరణాలు, విద్యార్థి బోధన పద్ధతులపై అవగాహన కల్పించారు.

పొత్తులతో కాదు..
ప్రజాభిమానంతో గెలుస్తాం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పట్టణంలో వార్డు పర్యటనలో ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్:

రాష్ట్రంలో ఎన్ని పార్టీలు పొత్తులు పెట్టుకుని వచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడి గ్రామం, పార్వతీపురం పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ప్రజాభిమానమే గెలుస్తుంది కానీ పొత్తులు గెలవవని చెప్పారు. చంద్రబాబు, పవన్‌లకు గెలిచే దమ్ములేక పొత్తులు పెట్టుకుంటున్నారని విమర్శించారు. మీకు మేలు జరిగితే ఓటు వేయండని అడిగే దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్ రెడ్డేనన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చి దిద్దిన ఘనత సీఎం వైఎస్ జగ జగన్‌మోహన్ రెడ్డిదేనని స్పష్టం చేశారు. పేద పిల్లలకు సైతం తన పిల్లలతో సమానంగా కార్పొరేట్ విద్యను అందించాలని జగన్ కోరుకుంటే చంద్రబాబు మాత్రం వారి పిల్లలను ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చదివించి పేదలకు ఇంగ్లిష్ మీడియం లేకుండా చేస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.



తాళ్లబురిడిలో మహిళల కష్టాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజలు

కార్యక్రమంలో మండల, పురపాలక సంఘం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకే

వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు పార్టీ అధిష్టానం రెండవ సారి టికెట్ ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే జోగారావును ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తమ పూర్తి మద్దతు తెలియజేయడమే కాకుండా మీ ద్వారా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మూడు మండలాలు, పురపాలక సంఘం నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంఘాల నాయకులు, పెద్దలు తదితరులు విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల్లో చేతిరాత నైపుణ్యం మెరుగుపరచండి



విద్యార్థుల్లో అభ్యసన, పఠన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ సామల సింహాచలం

పార్వతీపురం టౌన్: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు తెలుగు, ఆంగ్లభాషల్లో పఠన, చేతిరాత నైపుణ్యాలు మెరుగుపడే విధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని పార్వతీపురం మండల విద్యాశాఖాధికారి సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని గెంబలి వీధి, తెలుగు బ్రాహ్మణ మున్సిపల్ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా టీచర్ల డైరీలను, లెసన్ ప్లాన్స్ పరిశీలించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేసిన ఉండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వర్క్ బుక్స్ పరిశీలించి, విద్యార్థులకు చేతి రాతను చక్కగా నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల ఆంగ్లభాషా పఠన సామర్థ్యాన్ని పరిశీలించి చక్కగా చదివిన విద్యార్థులను అభినందించారు. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు లెర్న్ వర్డ్ పదాలను బోర్డ్‌పై ఉన్నవి చదివించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగించి బోధించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఆర్. శ్రీదేవి, జి.సురేష్, సీఆర్‌ఎంటీ బ్రహ్మాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీడీ డాక్టర్ ఎస్‌డీవీ రమణ

సీతానగరం: కేజీబీవీ విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండాలని, విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి సేవలందించాలని కేజీబీవీల రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన జీసీడీఓ రోజారాణి, ఏపీఓ సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి సీతానగరం మండలం జోగింపేట కేజీబీవీని సందర్శించారు. ముందుగా విద్యాలయంలో అమలు చేస్తున్న మెనూ పరిశీలించి విద్యార్థినులకు వడ్డించారు. పదవ తరగతి విద్యార్థినులతో మాట్లాడి విద్య, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థినులందరూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని భవిష్యత్‌లో ఉన్నత చదువులు అభ్యసించి సమాజానికి సేవలందించే ఉన్నత పదవులు అలకంరించాలని ఆకాంక్షించారు. జిల్లాలో రెండో విడతలో కేజీబీవీకి విడుదల చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించి ల్యాబ్ ఉపయోగాలను విద్యార్థినులకు వివరించారు. ల్యాబ్‌పై జిల్లాలోని అన్ని కేజీబీవీల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. పంచతంత్ర వంద రోజుల పరీక్ష ప్రణాళికా బద్ధంగా జరపడం వల్ల మంచి ఫలితాలు సాధించే అవకాశం ఎక్కువగా ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రిన్సిపాల్ జొన్నాడ సంధ్య,ఉపాధ్యాయిని శైలజ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏఓబీ భద్రత కీలకం

- ఆర్డీఓ హేమలత



ఆర్‌కే బట్టివలస చెక్‌పోస్టును తనిఖీచేస్తున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురం టౌన్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు (ఏఓబీ) గ్రామాల్లో భద్రత కీలకమని ఆర్డీఓ హేమలత అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె పార్వతీపురం మండలంలోని అడారు, ఆర్‌కే బట్టివలస చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పక్కనున్న ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి, సారా, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై దృష్టిసారించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాలని సూచించారు. ముఖ్యంగా ఎన్నికల నేపథ్యంలో ఒడిశా రాష్ట్రం నుంచి డబ్బు రవాణాపై దృష్టి సారిస్తూ ముందస్తు సమాచారం సేకరించాలని చెప్పారు. అనుమానం ఉన్న వాహనాలను గుర్తించి క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు

సీతానగరం: మండలంలోని గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ, శిశు మరణాల నివారణకు నిర్దేశించిన అధికారుల సమన్వయంతో సేవలందించాలని ఎంపీడీఓ ఎం ఈశ్వరరావు కోరారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పెదంకలాం, సీతానగరం, పీహెచ్‌సీ వైద్యాధికారులు, వెలుగు ఏపీఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఐసీడీఎస్ అధికారులతో శిశుమరణాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పర్యవేక్షణలో ఏడాది కాలంగా నిర్దేశించిన శాఖల అధికారులు చేసిన కృషిఫలితంగా శిశు మరణాలు తగ్గడం, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలతో మంచిఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. అలాగే పూర్తిస్థాయిలో శిశుమరణాల నివారణకు ముందు జాగ్రత్త చర్యలుగా గర్భిణుల్లో హిమోగ్లోబిన్ తనిఖీ చేయడం, ఎనీమియా నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రసవ సమయంలో గర్భిణులను ప్రభుత్వాస్పత్రుల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు సకాలంలో తీసుకుంటున్నందువల్ల మంచిఫలితాలు వచ్చాయన్నారు. శతశాతం శిశుమరణాల నివారణకు వెలుగు, వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్ శాఖల అధికార సిబ్బంది సమన్వయంతో సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో సీతానగరం, పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్లు రాధాకాంత్, పావని, సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, పీహెచ్‌ఎన్ సత్యవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు



సమావేశంలో మాట్లాడుతున్న పార్వతీపురం ఎన్నికల అధికారి హేమలత

పార్వతీపురంటౌన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని పార్వతీపురం ఎన్నికల అధికారి, ఆర్‌డీఓ హేమలత అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్‌లను, పోస్టర్లు, కటౌట్లు తదితర ప్రచార సామగ్రి ఉండరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై గురువారం ఆమె స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంసీసీ ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని ఈ సందర్భంగా చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ నియమ నిబంధనలను పటిష్టంగా అమలు పర్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళి అమల్లో ఎటువంటి అలసత్వం వహించారని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు కె.ఆనందరావు, ఎ. శ్రీనివాసరావు, జీవీ జనార్దన్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాంచాలిలో 11 మంది వలంటీర్ల తొలగింపు

పాచిపెంట: మండలంలోని పాంచాలి సచివాలయం పరిధిలో 11 మంది వలంటీర్లను అధికారులు గురువారం తొలగించారు. అయితే టీడీపీ నాయకులు ఓటమి భయంతోనే తమపై తప్పుడు ఫిర్యాదులు చేసి తమను అధికారులు తొలగించేలా చేశారంటూ బాధిత వలంటీర్లు ఆరోపిస్తున్నారు. వలంటీర్లు తెలిపిన వివరాల ప్రకారం..గతంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో వలంటీర్లు ఉన్న ఫొటోలను గ్రామంలోని టీడీపీ నాయకులు ఇప్పుడు ఎన్నికల అధికారులకు పెట్టి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సదరు 11 మంది వలంటీర్లను తొలగిస్తూ ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ ఫిర్యాదుపై ఎంపీడీఓ తమను గురువారం కార్యాలయానికి పిలిపించి విచారణ చేయగా అవి పాత ఫొటోలని, ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత తామెప్పుడూ ఎన్నికల నిబంధనలు అతిక్రమించలేదని లిఖితపూర్వకంగా తెలియచేశామని వివరించారు. అయినప్పటికీ మమ్మల్ని అన్యాయంగా తొలగించారని వాపోతున్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



రాజకీయ నాయకుల విగ్రహాలను వస్త్రాలతో కప్పివేస్తున్న దృశ్యం



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సీతానగరం: మండలంలో ఎన్నికల కోడ్ అమలు చేయాల్సిన బాధ్యత నిర్దేశించిన అధికారులపై ఉందని సెక్టార్ సూపర్‌వైజర్లు కె.కుమారవర్మ, వాహనాల తనిఖీ అధికారి చిన్నారావు అన్నారు. ఈ మేరకు గురువారం వారు వేర్వేరు ప్రాంతాల్లో ఎన్నికల నియమావళిని వివరిస్తూ పర్యటించారు. కృష్ణారాయపురం, బూర్జలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని వస్త్రాలతో కప్పివేశారు. అనంతరం పోలింగ్ కేంద్రాలు, ప్రభుత్వ రంగసంస్థలను పరిశీలించారు. అలాగే ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారి చిన్నారావు ఆధ్వర్యంలో పోలీసుల సహకారంతో రాష్ట్ర రహదారిపై మరిపివలస నుంచి అంటిపేట వరకూ తిరుగాడుతున్న వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర రహదారిపై రాకపోకలు నిర్వహిస్తున్న వాహనాలను నియోజకవర్గం ఎన్నికల పరిశీలకురాలు (ఆర్డీఓ) కె.హేమలత ఆదేశాలమేరకు తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సీతానగరం పోలీసు సిబ్బంది, బీఎల్వోలు వీఆర్వోలు పాల్గొన్నారు.

రాజన్నతోనే ఏజెన్సీ అభివృద్ధి

- గిరిజన నాయకులు సర్పంచ్‌లు



విలేకులతో మాట్లాడుతున్న గిరిజన నాయకులు

సాలూరు రూరల్: నియోజకవర్గంలో ఏజెన్సీ గ్రామాల అభివృద్ధి డిప్యూటీ సీఎం, గిరిజన శాఖమంత్రి పీడిక రాజన్నదొరతోనే సాధ్యమని సాలూరు మండల గిరిజన నాయకులు, సర్పంచులు అన్నారు. ఈ మేరకు గురువారం ఉదయం మండలంలోని తోణాం కందులపదం సర్పంచులు మువ్వల ఆదయ్య, తాడంగి కన్నం నాయుడు, గిరిజన నాయకులు చోడిపిల్లి బీసు తదితరులు విలేకరులతో మాట్లాడారు. సాలూరు నియోజకవర్గం అభివృద్ధిలో రాజన్నదొరది ప్రత్యేకపాత్ర అని, ఆయన లేకుంటే ఇంతగా అభివృద్ధి జరిగేది కాదన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులకు గిరిజనుల అభివృద్ధి ఇష్టంలేదని, అందుకే రాజన్నదొర చేస్తున్న అభివృద్ధిని పరోక్షంగా అడ్డుకునేవారని, అయితే ఆయన ఎదుట వీరి ఆటలు సాగలేదని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా పట్టు వదలకుండా రూ.5కోట్ల 12లక్షల 50వేలతో గోముఖి నదిపై వంతెన నిర్మాణాన్ని రాజన్నదొర పూర్తిచేయించి ప్రజలకు అంకితం చేశారన్నారు.

చురుగ్గా కొదమ రహదారి నిర్మాణం

అంతేకాకుండా ఏజెన్సీ గ్రామాలను కలుపుతూ రహదారులను నిర్మించకుండా ఎన్నో అడ్డంకులు టీడీపీ నాయకులు సృష్టించినప్పటికీ అటవీశాఖఅధికారులు సహకరించడంతో కొదమకు రహదారి నిర్మాణాన్ని చేపట్టడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే 12 గిరిజన గ్రామాల ప్రజలకు సౌకర్యం కలుగుతుందన్నారు. గిరిజన గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ వెంట ఉండాలని తెలుగుదేశం పార్టీ నాయకుల అసత్య ప్రచారాలను నమ్మవద్దని స్పష్టం చేశారు. ముఖ్యంగా నకిలీ గిరిజనులను దగ్గరకు రానివ్వద్దు అని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొరను అత్యధికమెజారిటీతో గెలిపించాలని కోరారు. అప్పుడే గిరిజనులు, గిరిజన ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని వివరించారు.

సారా, మద్యం స్వాధీనం

- ఎస్‌ఈబీ సీఐ బి.నరసిహమూర్తి



స్వాధీనం చేసుకున్న సారాతో ఏఈఎస్ జీవన్ కిశోర్, సిబ్బంది

పార్వతీపురం టౌన్: సారా రవాణా, అమ్మకాలు, తయారీపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్ఈబీ సీఐ బి.నరసిహమూర్తి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం మండలంలోని బుదురువాడ గ్రామంలో సారా రవాణాపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో సారా రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. బుదురువాడ గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 160 లీటర్ల సారా, 76 మద్యం సీసాలు, 24 బీర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన తాడంగి నగేష్ ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమ రవాణా చేస్తున్న సమయంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో సారా రవాణా అమ్మకాలు, రవాణాపై సమాచారం ఉంటే తక్షణమే ఎస్‌ఈబీ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. ఈ దాడుల్లో ఎస్సై డి.పద్మావతి, హెచ్‌సీ కె. శ్రీనివాసరావు, సిబ్బంది డి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

బూత్ కమిటీలదే కీలక పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: రానున్న ఎన్నికల సంగ్రామంలో బూత్ కమిటీలే కీలకపాత్ర వహిస్తాయని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని మిర్తివలస, తుమరాడ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో గురువారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బూత్ కమిటీలతో ఎన్నికల ప్రక్రియ విజయవంతం చేయాలని చెప్పారు. బూత్ కమిటీలు కుటుంబాలను కలుస్తూ ఓటింగ్ సరళిని పెంచాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వరాదని చెప్పారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపించుకుని పార్టీని విజయపథంలో నడిపించాలని కోరారు. బూత్‌లవారీగా నిర్ధారించిన కమిటీలు ప్రతి ఇంటికి తిరిగి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి, మీకు మంచి జరిగిందంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయమని అడగాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, జెడ్పీటీసీ రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, పార్టీ మండల మహిళాసంఘం అధ్యక్షురాలు దుర్గేశ్వరి, జి.సత్యారావు, వి.బాలాజీ, బి.త్రినాథ, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కాకులతోటకు తీరనున్న వంతెన సమస్య

- రాజన్నదొర చొరవతో తుది దశకు చేరుకున్న పనులు



వేగావతి నదిపై జరుగుతున్న వంతెన నిర్మాణం



వంతెనపై సైడ్ వాల్స్ నిర్మాణం

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక కృషితో సాలూరు పట్టణ సమీపంలోని కాకులతోట వద్ద గల వేగావతి నదిపై దశాబ్దాల కాలంగా ఉన్న వంతెన సమస్య త్వరలో తీరనుంది. సాలూరు నుంచి పాచిపెంట మండలంలోని మోసూరు, మాతుమూరు, గురివినాయుడుపేట తదితర మైదాన, గిరిశిఖర ప్రాంతాల ప్రజలు సాలూరు, ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు పట్టణ సమీపంలో కాకులతోట వద్ద గల వేగావతి నదిపై వంతెన కీలకం. గతంలో ఇక్కడ నిర్మించిన కాజ్‌వేపై గుండా వర్షాల సమయంలో, పాచిపెంట మండలకేంద్రంలో పెద్దగెడ్డ రిజర్వాయర్ గేట్లు తెరిచి నీటిని విడుదల చేసినప్పుడు, వేగావతి నది ఉధృతంగా ప్రవహించేది. ఈ నది ఉధృతి తగ్గే వరకు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయేవి. కాగా గతంలో ఈ వేగావతినదిలో అదుపుతప్పి చాలామంది మరణించిన సంఘటనలు ఉన్నాయి. ఇంత కీలకమైన ఈ వంతెన గురించి గత పాలకులు పట్టించుకుని నిర్మాణం చేపట్టిన దాఖలాలు లేవు. అయితే ప్రజలకు మేలు చేయడమే అజెండాగా పనిచేసే ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రభుత్వంలో రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడి ప్రభుత్వం ద్వారా సుమారు రూ.8కోట్ల15 లక్షలు మంజూరు చేయించడంతో ఆర్‌అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో పనులు ప్రారంభింపచేశారు. ఎప్పటికప్పుడు ఈ పనులపై ఆ శాఖాఅధికారులతో సమీక్షాసమావేశాలు నిర్వహించి పనులు త్వరగా పూర్తిచేయాలని కోరారు. ఈ క్రమంలో పనులు దాదాపు తుదిదశకు చేరుకున్నాయి. అప్రోచ్ రోడ్డు పనులు కూడా పూర్తయి వంతెన సైడ్ వాల్స్ నిర్మాణం జరుగుతోంది. మరికొన్ని రోజుల్లోనే పనులన్నీ పూర్తయే అవకాశం ఉంది. రానున్న వర్షాకాలంలో ఈ వంతెన సమస్య ఇక ఉండదని అటుగా ప్రయాణాలు చేస్తూ, ఈ వంతెన నిర్మాణ ప్రగతిని చూస్తున్న ప్రజలు మాట్లాడుకుంటున్నారు.